ఎంబీఏ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 29: ఓయూ పరిధిలోని బీఎస్-ఎంఎస్ (కంప్యూటర్ సైన్స్-ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ డ్యుయల్ డిగ్రీ ప్రోగ్రాం) పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాము లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్ లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్ష ఫీజును వచ్చేనెల 11 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో 18వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను అక్టోబర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నా రు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఫార్మా పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 29: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఫార్మ్ డీ, ఆరేళ్ల ఫార్మ్ డీ అన్ని సంవత్సరాల మెయిన్, బ్యాక్ లాగ్ పరీక్షలను సెప్టెంబర్ 6 నుంచి, ఎమ్మెస్సీ (స్పోర్ట్స్ న్యూట్రిషన్), ఎమ్మెస్సీ (అప్లైడ్ న్యూట్రిషన్) కోర్సుల రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను సెప్టెంబర్ 10వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

సీపీజీఈటీ సూపర్ న్యూమరరీ సీట్లకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ షెడ్యూల్ విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 29: రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీలలో వివిధ పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన సీపీజీఈటీ-2024 సూపర్ న్యూమరరీ సీట్లకు సర్టిఫెట్ వెరిఫికేషన్ షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు సీపీజీఈటీ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి తెలిపారు. క్యాప్, ఎన్‌సీసీ, పీహెచ్ కేటగిరీల అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ మ్యానువల్‌గా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఓయూలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో వచ్చే నెల 5వ తేదీ నుంచి ఇది జరుగుతుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు క్రమం తప్పకుండా తమ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

బిల్లులు చెల్లించాలని ఒత్తిడి తేవొద్దు

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్
- అర్హులందరికీ జీరో విద్యుత్ బిల్లులు అమలు చేయాలని అధికారులకు ఆదేశం

కళానీగూడలో పర్యటించి బస్తీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, అధికారులు

బేగంపేట్, ఆగస్టు 29: బిల్లులు చెల్లించాలని పేదలను ఇబ్బందులకు గురి చేయొద్దని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన బేగంపేట్ డివిజన్‌లోని జవహర్ జనతా, బర్తన్ కాంపౌండ్ బస్తీల్లో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ క్రమంలో బస్తీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జీరో విద్యుత్ బిల్లులు అమలు చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిందని, నేడు అధికారంలోకి వచ్చాక అది అమలు చేయడం లేదని ఈ సందర్భంగా పలువురు బస్తీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తెలంగాణ ప్రభుత్వ హయాంలో ఉచితంగా తాగునీటిని సరఫరా చేయగా ఇప్పుడు నల్లా బిల్లులు చెల్లించాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. లేదంటే నీటి సరఫరా నిలిపివేస్తామని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఎవరు కూడా బిల్లులు చెల్లించవద్దని చెప్పారు. బస్తీల్లో నివసించే పేదలను బిల్లులు చెల్లించాలని ఒత్తిడి చేయొద్దని, అర్హులైన వారందరికి జీరో విద్యుత్ బిల్లులతోపాటు ఉచిత నీటి సరఫరాను వర్తింప చేయాలని అన్నారు. ఇందుకోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తమ బస్తీలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదని రోడ్లపైకి మురుగు చేరి ఇబ్బందులు పడుతున్నామని పలువురు పేర్కొన్నారు. వేలాడుతున్న విద్యుత్ వైర్లను కూడా తొలగించాలని చెప్పారు. డ్రైనేజీ ఏర్పాటుకు రోడ్ల నిర్మాణానికి వెంటనే ప్రతిపాదనలు అందించాలని, అలాగే స్థానికంగా విద్యుత్ సంబంధిత సమస్యలు తలెత్తకుండా చూస్తూ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచెలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే తాగునీటి సమస్యలు కూడా తలెత్తకుండా చూడాలని జలమండలి అధికారులకు సూచించారు. బస్తీలో ఉన్న బస్తీ దవఖానను సందర్శించి అక్కడ వైద్య సేవలు, మందుల గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో బేగంపేట్ సర్కిల్ డీసీ సమ్మయ్య, జలమండలి జీఎం వినోద్, ఈఈ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇండ్లను కేటాయించాలి

బేగంపేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బండమైసమ్మనగర్‌లో

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన బన్సీలాల్‌పేట్ బస్తీవాసులు, బీఆర్ఎస్ నాయకులు

అర్హులైన వారికి త్వరగా డబుల్ బెడ్‌రూం ఇండ్లను కేటాయించాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కోరారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ స్థానికులు డబుల్ బెడ్‌రూం ఇండ్లను అర్హులకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని గురువారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కలెక్టర్‌తో మాట్లాడి సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలను దృష్టిలో పెట్టుకొని బండమైసమ్మనగర్‌లో డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు విద్యుత్ సౌకర్యాలతో కూడిన 301 డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించినట్టు తెలిపారు. వాటిలో 255 మంది లబ్ధిదారులకు కేటాయించామని చెప్పారు. మిగిలిన ఇండ్లను కూడా వీలైనంత త్వరగా అర్హులను గుర్తించి కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇండ్ల నిర్మాణం పూర్తి అయినప్పటికీ కేటాయించకపోవడం వల్ల పేదలు వేలాది రూపాయలు అద్దెలు చెల్లిస్తూ ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వెంటనే అర్హులను గుర్తించి వారికి ఇండ్లను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో బన్సీలాల్ పేట్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 29: రాష్ట్రంలోని వర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ కాంట్రాక్ట్ తెలంగాణ స్టేట్ (యూటీఏసీటీఎస్) అధ్యక్షుడు డాక్టర్ పరుశురాం డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. యూటీఏసీటీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఓయూ టెక్నాలజీ కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తీర్మానాల వివరాలను పరుశురాం వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ వర్సిటీలకు వీసీలను త్వరలోనే నియమిస్తామని సీఎం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. 60 ఏళ్లు దాటిన తరువాత కూడా కాంట్రాక్ట్ అధ్యాపకులు కొనసాగవచ్చని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను స్వాగతించారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల రెగ్యులరైజేషన్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఆ తరువాతే వర్సిటీల్లో అధ్యాపక భర్తీ చేయాలని సూచించారు. కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఏడవ పీఆర్‌సీని అమలు చేయాలని అన్నారు. తమకు బేసిక్ పే, డీఏ, హెచ్ఆర్ఏతో కూడిన పే స్కేళ్లను వెంటనే అమలు పరచాలని కోరారు. యూజీసీ నిబంధనల ప్రకారం వరుసగా ఐదేళ్లు పూర్తైన సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చాలని అన్నారు. కార్యక్రమంలో యూటీఏసీటీఎస్ నాయకులు డాక్టర్ జితేందర్‌రెడ్డి, డాక్టర్ భీమయ్య, డాక్టర్ తిరుపతయ్య, డాక్టర్ విజయకాంత్, డాక్టర్ అర్జున్, డాక్టర్ యశ్వంత్‌రావు, డాక్టర్ రమేశ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న యూటీఏసీటీఎస్ అధ్యక్షుడు డాక్టర్ పరుశురాం

వర్సిటీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఓయూ పరిపాలన భవనం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 29: రాష్ట్రంలోని అన్ని వర్సిటీల ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (తుంటియా) నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకు గురువారం డిమాండ్ డే నిర్వహించారు. ఓయూ పరిపాలనా భవనం ఎదుట ఎన్జీవోస్ స్టాఫ్ అసోసియేషన్, టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్, ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఎన్జీవోస్ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు బియ్యాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్న పెన్షన్, హెల్త్ కార్డులను తమకు కూడా వర్తింపజేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వర్సిటీలకు రెగ్యులర్ వైస్ చాన్స్‌లర్లను నియమించాలని విజ్ఞప్తి చేశారు. 2001 నుంచి 2004 వరకు నియమితులైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని 2004 సెప్టెంబర్ తరువాత నియమితులైన ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. వర్సిటీల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర ఉద్యోగుల పోస్టులను భర్తీ చేసేందుకు వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలని అన్నారు. కాంట్రాక్ట్, టైంస్కేల్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని ఎత్తివేసి నేరుగా వర్సిటీయే జీతాలు చెల్లించాలని కోరారు. పాలక మండలిలో నాన్ టీచింగ్ ఉద్యోగులకు ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కామన్ సర్వీస్ రూల్స్‌ను అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పదోన్నతుల వ్యవస్థను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వార్షిక బడ్జెట్‌లో విద్యారంగానికి ఆరు శాతం నిధులను కేటాయించి, బలోపేతం చేయాలన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలైన సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు నాగరాజురావు, రవి, విజయ్‌కుమార్, అక్బర్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బడుల సమస్యల పరిష్కారానికి కృషి

జ్యోతి వెలిగించి సమావేశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట్, ఆగస్టు 29: సాధారణ స్థాయి బడ్జెట్ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అమీర్‌పేట్, ఖైరతాబాద్ మండలాల పరిధిలో 150 ప్రైవేట్ పాఠశాలలుంటే అందులో 120 సాధారణ బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలలని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా పన్నులు చెల్లించడం ఇబ్బందికరంగా మారిందని సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కొన్ని మినహాయింపులు జరిగేలా చూడాలంటూ విజ్ఞప్తి చేశారు. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎం.అగస్టిన్, ప్రధాన కార్యదర్శి పి.సుధాకర్, కోశాధికారని ఖుతుబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న డీసీ సుభాష్‌రావు

అడ్డగుట్ట, ఆగస్టు 2: ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ సుభాష్‌రావు అన్నారు. గురువారం మెట్టుగూడ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డెంగ్యూ, మలేరియా, సీజనల్ వ్యాధుల వివరాలను వైద్యుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీసీ మాట్లాడుతూ ప్రజలు దగ్గు, జలుబు, జ్వరం ఉంటే నిర్లక్ష్యం చేయొద్దని, వెంటనే దగ్గర్లోని ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది, ఆశవర్కర్లు బస్తీ, కాలనీల్లో తిరుగుతూ సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించి వాటి కట్టడికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లో పర్యటించిన కార్పొరేటర్ హేమ

అధికారులతో కలిసి బ్రాహ్మణబస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ హేమ తదితరులు

సికింద్రాబాద్, ఆగస్టు 29: వినాయక నవరాత్రి ఉత్సవాలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ హేమ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని బ్రాహ్మణ బస్తీ, మధురానగర్‌కాలనీ ఎస్ఆర్ హాస్పిటల్ రోడ్ ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. ఎస్ఆర్ ఆసుపత్రి వెనక లైన్‌లో నూతన సీసీరోడ్ మంజూరైందని చెప్పారు. వినాయక నిమజ్జనం తరువాత పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. రూ.30లక్షలు, అలాగే బ్రాహ్మణ బస్తీలోని ఎస్‌బీఐ బ్యాంక్ లైన్‌లో సీసీ రోడ్‌కు రూ.14 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, బీఆర్ఎస్ నాయకులు శైలెందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆభరణాల చోరీ.. వ్యక్తి రిమాండ్

మారేడ్‌పల్లి, ఆగస్టు 29: మహిళల మెడలోంచి బంగారు ఆభరణాలు దొంగిలించి తప్పించుకుని తిరుగుతున్న ముఠా సభ్యుల్లో కార్ఖానా పోలీసులు ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. నాంపల్లిలోని మల్లేపల్లికి చెందిన మహ్మద్ జహంగీర్ (30) పెయింటర్. మహ్మ ద్ అమీర్ అలియాస్ షేక్ అమీర్, షఫీ ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతూ తప్పించుకొని తిరుగుతున్నారు. ఆగస్టు 12న కార్ఖానా పోలీసు స్టేషన్ పరిధిలో మహంకాళి బోనాల జాతర సందర్భంగా ముఠా సభ్యులు మహిళ మెడలోంచి బంగా రు ఆభరణాలను దొంగిలించారు. దీంతో బాధితులు కార్ఖానా పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. మహ్మద్ జహంగీర్ అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాన్ని అంగీకరించాడు. నిందితుడి నుంచి 10 గ్రాముల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. మహ్మద్ అమీర్ అలియాస్ షేక్ అమీర్, షఫీ పరారీలో ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో మహిళలు తమ విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

ఆలయంలో అన్నదానం

సికింద్రాబాద్, ఆగస్టు 29: సీతాఫల్‌మండి దత్తాత్రేయ, సాయిబాబా సమేత ఆలయంలో గురువారం పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ప్రతివారం భక్తులకు దాతలు అన్నదానం చేస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వివేక్, టెంట్‌హౌజ్ నరేందర్, పవన్, టెంపుల్ రాము తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయాలి

సికింద్రాబాద్, ఆగస్టు 29: పేదలకు సేవ చేసేందుకు యువత ముందుకు రావాలని బీజేపీ మాజీ కార్పొరేటర్ స్వరూప అన్నారు. తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గురువారం బ్రాహ్మణ బస్తీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కుసుమ కుమారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాగ్రిని ఉచితంగా అందజేశారు. ఆమె మాట్లాడుతూ భాష అంటే మాటల వారధి మాత్రమే కాదని, మన మూలాలను తెలియజెప్పి భవిష్యత్ దిశగా ముందుకు నడిపే సారథి అని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి ప్రసాద్‌గౌడ్, అంబాల రాజు, అజయ్, ఉపాధ్యాయురాలు ఉష, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు భాష ఔన్నత్యానికి కృషి

భాషా దినోత్సవంలో ప్రముఖ కవయిత్రి ఐనంపూడి శ్రీలక్ష్మి

కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రముఖ కవయిత్రి ఐనంపూడి శ్రీలక్ష్మి, పాల్గొన్న ప్రముఖులు

బొల్లారం, ఆగస్టు 29: తెలుగు భాష ఔన్నత్యానికి తెలుగు వారిగా ఎలుగెత్తి గళం విప్పాలని బొల్లారం రాష్ట్రపతి నిలయం అధికారి రజనీ ప్రియ, ప్రముఖ కవయిత్రి ఐనంపూడి శ్రీలక్ష్మి అన్నారు. గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని (గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి) పురస్కరించుకొని బొల్లారం రాష్ట్రపతి నిలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కవులు ఐనంపూడి శ్రీలక్ష్మి, డాక్టర్ ఓలేటి పార్వతీశం, సిరి, కమలాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రపంచీకరణ నేపథ్యంలో తెలుగు భాష ఎదుర్కొంటున్న సవాళ్లు అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల, పాఠశాల ఉపాధ్యాయులు, రాష్ట్రపతి నిలయం సిబ్బంది పాల్గొన్నారు.

బొల్లారం రాష్ట్రపతి నిలయంలో సాంస్కృతిక కార్యక్రమాలతో అలరిస్తున్న విద్యార్థినులు

సమాజంలో దివ్యాంగులకు సమాన హక్కులు

మారేడ్‌పల్లి, ఆగస్టు 29: సమాజంలో దివ్యాంగులకు సమాన హక్కులు ఉంటాయని వీల్ చైర్ వారియర్ డాక్టర్ సాయి కౌస్తవ్ దాస్‌గుప్త అన్నారు. యంగ్ ఇండియా చొరవతో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజేబుల్‌నెస్ (నైపిడ్) ఆధ్వర్యంలో కంటోన్మెంట్ మనోవికాస్‌నగర్‌లో దివ్యాంగులకు ఇంటర్వ్యూ నిర్వహించి ఉద్యోగ నియమాక పత్రాలు అందజేశారు. దివ్యాంగుల్లో విద్యార్హతలు బట్టి ఉద్యోగాలు ఇచ్చేందుకు తాజ్ గ్రూప్, ఇక్రిశాట్, సిడ్బీ, డీసీఎల్, ఫెనోమ్, క్వెస్టర్ సంస్థల ప్రతినిధులు వచ్చారు. దాస్‌గుప్త మాట్లాడుతూ దివ్యాంగులకు సైతం ఈ ప్రపంచంలో ముందుకు వెళ్లేందుకు తగిన శక్తి సామర్థ్యాలు ఉంటాయని, వారికి అవకాశాలు ఇస్తే ప్రపంచాన్ని జయించగలరని అన్నారు. 25 మంది దివ్యాంగులు హాజరయ్యారు. కార్యక్రమంలో నైపిడ్ డైరెక్టర్ రామ్‌కుమార్, సుమిత్ అగర్వాల్, శివాని లోహ్యా, అశ్విన్‌అగర్వాల్, అమ్మిషా, ఆశిష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న దివ్యాంగులతో సాయి కౌస్తవ్ దాస్‌గుప్త

బస్తీల్లో చెత్త తొలగించాలి

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 29: చాచానెహ్రూనగర్, రామస్వామి కాంపౌండ్ బస్తీల్లో ఎక్కడి చెత్త అక్కడే ఉంటున్నదని బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కె.హేమలత అన్నారు. గురువారం ఆమె పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. బీఆర్ఎస్ నాయకులు కె.లక్ష్మిపతి, అచ్చా నర్సింగ్‌రావు, రమేశ్, వెంకటేశ్, నాగభూషణం, కుశాల్, అబ్బాస్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మూడోరోజు కృష్ణాష్టమి వేడుకలు

సికింద్రాబాద్, ఆగస్టు 29: సీతాఫల్‌మండి త్రీ స్టార్స్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మూడో రోజు ముఖ్య అతిథిగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీజేపీ నాయకులు కార్తీక్‌రెడ్డి, చంద్రారెడ్డి దంపతులు, కార్పొరేటర్ హేమ, బౌద్ధనగర్ కార్పొరేటర్ శైలజ బీఆర్ఎస్ యువ నాయకుడు రామేశ్వర్‌గౌడ్ పూజల్లో పాల్గొన్నారు. కమిటీ సభ్యులు కృష్ణ, అశ్విన్, బాలాజీ, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రకుంట చెరువును సంరక్షించాలి

బీఆర్ఎస్ యువజన విభాగం గ్రేటర్ అధ్యక్షుడు ఆలకుంట హరి

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 29: రాష్ట్ర ప్రభుత్వం జంటనగరాల పరిధిలో హైడ్రా పేరుతో చెరువులు, కుంటల సంరక్షణకు ఏర్పాటు చేసిన యంత్రాంగం తార్నాకలోని ఎర్రకుంట చెరువును కాపాడడంపై దృష్టి సారించాలని బీఆర్ఎస్ యువజన విభాగం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆలకుంట హరి డిమాండ్ చేశారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం మొత్తం ఎనిమిది సర్వే నంబర్లలో 23 ఎకరాలను ఎర్రకుంట చెరువు ఎఫ్‌టీఎల్ భూమిగా 2010లో అప్పటి తహసీల్దార్ గుర్తించి, హద్దులు నిర్ధారించారని చెప్పారు. చెరువుకు లేక్ ఐడీ నంబర్ 4500 కేటాయించారని తెలిపారు. గతంలో ఇరిగేషన్ విభాగం అందులో ఐదెకరాల స్థలాన్ని జీహెచ్ఎంసీకి కేటాయించినప్పటికీ, ఇప్పటికీ సంబంధిత అధికారులు దానిని స్వాధీనం చేసుకోలేదని మండిపడ్డారు. 23 ఎకరాల చెరువు కాస్తా ఇప్పుడు సుమారు ఏడెకరాల కుంటగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు అనవాళ్లు కోల్పోయి ఆక్రమణలకు నిలయంగా మారిందని వాపోయారు. బడాబాబులు, పలుకుబడి ఉన్నవాళ్లు చెరువును ఆక్రమించి, భవన నిర్మాణాలు చేసుకున్నారని ఆరోపించారు. హైడ్రా పేరుతో హల్‌చల్ చేస్తున్న ప్రభుత్వం వెలువరించిన జాబితాలో ఎర్రకుంట చెరువు లేకపోవడం శోచనీయమన్నారు. ఎవరినో కాపాడేందుకే ప్రభుత్వం ఎర్రకుంట చెరువును పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, ఎర్రకుంట చెరువులో అక్రమ నిర్మాణాలను కూల్చి, చెరువును పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

PUBLIC NOTICE

This is to inform the general public that **Vanam Bala Krishna** is the owner of House No. 7-1-246/35, Plot No. 35, land admeasuring 77 Sq.yds., situated at Balkampet, BJR Colony, Hyderabad who acquired the same vide Registered Gift Deed No. 1023/2016, Dated 25-05-2016 and has approached Unity Small Finance Bank Ltd. for Financial Assistance.

Whosoever has got any claims or rights over the above mentioned property. Please Contact: J.Sivanesan, Advocate, Contact No.